క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: విద్యుత్ మరమ్మతు కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ హన్మంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీపురం కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, ఈస్ట్ అండ్ వెస్ట్ ప్రశాంత్‌నగర్, అఫ్జల్‌నగర్, బంజారానగర్, రేస్‌కోర్స్ రోడ్, హైటెక్ ఫంక్షన్‌హాల్, ఆర్‌టీఓ ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు అరుంధతి కాలనీ, జమాల్‌కాలనీ, మొయిన్‌బాగ్, ఫతేష్‌నగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, సీబీఐ క్వార్టర్స్, వాటర్ ట్యాంక్, జామియా మసీద్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈ వివరించారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బాజర్‌లలో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో..టమోటా (లోకల్) ఒక కిలో రూ.15, (618 రకం) రూ.15, వంకాయ రూ.26, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.50, కాలీఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.09, కారెట్ రూ.20. దొండ రూ.35, ఆలుగడ్డ రూ. 20, ఉల్లి రూ.19, గోకర రూ.40, దోస రూ.25, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, అరటి కాయ రూ.09, చిక్కుడు రూ.50, ఆర్వి రూ.70, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.33, బీట్‌రూట్ రూ.15, కీర రూ.18, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.45. ఈరోజు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

'బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి'

మలక్‌పేట: 'ప్రజాగోస బీజేపీ భరోసా' నినాదంతో శక్తి కేంద్రాల్లో శుక్రవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు కొనసాగనున్న కార్నర్ మీటింగ్‌లను విజయవంతం చేయాలని ఆ పార్టీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో 4 నియోజకవర్గాలలో 400, మలక్‌పేట నియోజవర్గంలో 100 శక్తి కేంద్రాల్లో 15 రోజుల పాటు కార్నర్ మీటింగ్‌లు, బహిరంగ సభలు ఉంటాయని తెలిపారు. ప్రధాని మోదీ పాలనలో అమలు చేస్తున్న పథకాలు ప్రజల దగ్గరకు తీసుకెళ్లాలని కోరారు. బీఆర్ఎస్ అవినీతి పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించాలన్నారు.

ఘనంగా స్పటిక లింగం ప్రతిష్ఠాపన



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

చాదర్‌ఘాట్: ఓల్డ్ మలక్‌పేటలోని శ్రీ రామచంద్రస్వామి ఆలయంలో స్పటిక లింగం ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. గురువారం వేద పండితులు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపన చేశారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాతలు అవంతి, తరుణ్, ఆలయ చైర్మన్ అమరేందర్‌గౌడ్, ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్, నక్క అమరేందర్‌గౌడ్, బజరంగ్, బాబు శ్రీనివాస్, చౌకి రాజు, రాజారావుగౌడ్, రాజేష్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి దిగ్బంధాన్ని జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

మన్సూరాబాద్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతకు బీజేపీ మోసపూరిత వైఖరికి నిరసనగా మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 13న హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధానికి మాదిగ ఉపకులాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నేతలు పిలుపునిచ్చారు. ఎల్‌బీనగర్ కేంద్రంగా జరిగే జాతీయ రహదారి దిగ్బంధం పోస్టర్‌ను ఎల్‌బీనగర్‌లోని బీఆర్. అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నేతలు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ 9 ఏళ్లు కావస్తున్నా వర్గీకరణ చేయకుండా మాదిగ ఉపకులాలను మోసం చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి బత్తిని సుధాకర్‌మాదిగ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, నాయకులు మల్లెపాక అనిల్‌కుమార్‌మాదిగ, వీఎస్ రాజు మాదిగ, బుర్ర రవిమాదిగ, డప్పు మల్లికార్జునమాదిగ, శోభారాణి మాదిగ, రఘువరన్‌మాదిగ, రాజశేఖర్‌మాదిగ పాల్గొన్నారు.

పురాతన మెట్ల బావుల

కట్టడాలను అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మెట్ల బావులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నాయకులు

ఎల్‌బీనగర్: నియోజకవర్గం పరిధిలోని పురాతన మెట్లబావుల కట్టడాలను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరుకు అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం మన్సూరాబాద్ డివిజన్‌లోని సహార ఎస్టేట్‌లోని లలితా రామలింగేశ్వరాస్వామి ఆలయం వద్ద ఉన్న మెట్ల బావితోపాటు సాహెబ్‌నగర్‌లోనా త్రినేత్ర ప్రసన్న ఆంజనేయస్వామి గుడి వెనుక ఉన్న బావులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సుమారు రూ.6 కోట్లతో ఈ బావులను అభివృద్ధి చేయనున్నామని పేర్కొన్నారు. ఈ రెండు బావులకు 400 ఏళ్ల చరిత్ర ఉందని తెలిపారు. ఈ రెండు బావుల అభివృద్ధికి పురావస్తు, హెచ్‌ఎండీఏ అధికారులు సంయుక్తంగా అంచనాలు తయారు చేస్తున్నారని రెండు మూడు రోజుల్లో అంచనాలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు. ముందుగా బావుల్లో ఉన్న పూడికతీత పనులు ప్రారంభిస్తామని, దీంతో బావుల్లో నీటి ఊట వస్తుందని తెలిపారు. ఈ బావులను చూసేందుకు చుట్టూ రోడ్లు వేయనున్నామని దీంతో ప్రజలు ఈ బావులను సందర్శించేందుకు అనువుగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్‌రెడ్డి, మల్లారెడ్డి, నాగరాజు, జగదీష్‌యాదవ్, రఘువీర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేష్, బాలరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ హయత్‌నగర్ పరిధి బొమ్మలగుడి నుంచి శివంహిల్స్ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగింపజేసినందుకు సమీప కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు గురువారం కార్పొరేటర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రోడ్డు మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగింపజేసానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, కృష్ణాగుప్తా, జెట్ట మహేశ్వర్, మాన్య నాయక్, మాధవరెడ్డి, హరినాథ్, ప్రవీణ్‌గౌడ్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా మన్సూరాబాద్ పెద్ద చెరువు...

మన్సూరాబాద్ పెద్ద చెరువును అభివృద్ధి పరిచి పర్యటక కేంద్రంగా మారుస్తానని కార్పొరేటర్ నర్సింహారెడ్డి అన్నారు. మార్నింగ్‌వాక్‌లో భాగంగా గురువారం పెద్ద చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పెద్ద చెరువులో వాకింగ్‌ట్రాక్, ఓపెన్ జిమ్, యోగా కేంద్రం, విద్యుత్ దీపాలు, ట్రాక్‌పై కూర్చునేందుకు వీలుగా బెంచీలు, పచ్చిక బయళ్లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్, వాకర్స్, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అశోక్‌కుమార్‌కు డాక్టరేట్



చంపాపేట: చంపాపేటకు చెందిన ఈసీఐఎల్ డీజీఎం అశోక్‌కుమార్ యాదవ్‌కు జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందించినట్లు గురువారం అశోక్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో డీజీఎంగా విధులు నిర్వర్తిస్తున్న తాను ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగంలో బహుళ మోడల్ బయోమెట్రిక్ స్ట్రాటజీ సంచలనం అనే అంశంపై తాను చేసిన పరిశోధనలకు జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పట్టాతో పాటు డాక్టరేట్ అందించినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మనిలాల్, శశిపాల్‌రెడ్డి, కోట్ల శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రత్యంగిరా దేవి శోభాయాత్ర



అమ్మవారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠ విభాగ ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి అమ్మవారి పల్లకీ సేవ–ఊరేగింపుతో ముగిసిశాయి. వందలాది మహిళల కోలాట నృత్యంతో, వేలాది భక్తులతో ఊరేగింపు ఆర్‌కేపురం, అలకాపురి, టెలిఫోన్ కాలనీల గుండా సాగింది. ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ.. పీఠాధిపతులు జగద్గురువులు శ్రీ శ్రీ శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి ఆశీస్సులతో అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిసిశాయని తెలియజేశారు. ప్రతిరోజూ వేలకొలది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని, అందరికీ అన్నప్రసాద ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మాధికారి వల్లూరు శివకోటేశ్వర రాజు దంపతులు, హరీష్, విఠల్ శర్మ, సాయికుమార్ శర్మ, అరుణ, హేమ మూర్తి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ అరుణ సురేందర్‌యాదవ్

నాగోలు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాగోలు కార్పొరేటర్ అరుణ సురేందర్‌యాదవ్ అన్నారు. గురువారం నాగోల్ డివిజన్‌లోని ప్రభుత్వ హైస్కూల్‌లో శృతి–శుభ్రతా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్‌ను ఒక మహోద్యమంలా మన ప్రధాని మోదీ దేశమంతా ప్రచారం చేస్తున్నారు. ఇంటిలోని చెత్తను వీధిలో వేయడం సరికాదు. చెత్తను తడి, పొడి చెత్తగా విడదీసి వేర్వేరు చెత్త కుండీలలో వేయాలని కోరారు. రోడ్లపై చెత్త వేయకుండా స్వచ్ఛ్ ఆటోలలో మాత్రమే వేయాలి కోరారు. పాఠశాలలు దేవాలయంతో సమానం.. అటువంటి దేవాలయంలో చెత్తను వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిరంతర కృషి

నాగోలు: డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ బీజేపీ కార్యవర్గ సమావేశం గురువారం కొత్తపేటలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. బీజేపీ కార్యకర్తలు, నాయకులు చేసిన కృషి వల్లే కార్పొరేటర్‌గా గెలిచానని తెలిపారు. డివిజన్ ప్రజలకు ఎల్లవేళలా తోడుంటానని, ప్రతిఒక్కరూ తనకు ఫోన్ కాల్ ద్వారా మీకు అందుబాటులో ఉంటానన్నారు. కొత్తపేట డివిజన్ కార్పొరేటర్‌గా పవన్‌కుమార్ ఎన్నికై రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డివిజన్ నాయకులు కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు కరాటేలో శిక్షణ

చంచల్‌గూడ: చదువులతో పాటు విద్యార్థుల శరీర ధారుఢ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు చంచల్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి అన్నారు. ఉదయం 7.30 నుంచి 8 గంటల వరకు కరాటేలో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న 8 మంది అరెస్టు



గంజాయిని తరలిస్తూ పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి

నాగోలు: ఒడిశా నుంచి నగరానికి గంజాయిని తరలిస్తూ అధిక ధరలకు అమ్ముతున్న 8 మందిని ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీస్‌లు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 10 కేజీల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలు, రూ. 56,930 లక్షల నగదు, 10 ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎల్‌బీనగర్ పోలీస్‌ల వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన షేక్ అబ్బాస్(24) 2021లో డిప్లొమా పూర్తి చేసి ప్రస్తుతం ఉద్యోగ కోసం ఎదురుచూస్తున్నాడు. నాగోలు వెంకటరమణ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇతను ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి నగరంలో అధిక ధరకు అమ్ముతాడు. గతంలో మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టు అయి జైలు వెళ్లి వచ్చాడు. వెంకటరమణ కాలనీలో నివాసం ఉండే మర్యాద దినేష్‌రెడ్డి(22) ఇంజినీరింగ్ మధ్యలోనే వదిలేశాడు. ఎల్‌బీనగర్ సరస్వతినగర్ కాలనీలో నివాసం ఉండే చెర్కు చందు(22) ఐటీఐ 2022లో పూర్తి చేసి ఉద్యోగా అన్వేషణలో ఉన్నాడు. వనస్థలిపురం, ప్రగతినగర్‌లో నివాసం ఉండే అవుల సందీప్(22) బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. నాగోలు వెంకటరమణ కాలనీలో ఉండే అజరు షాషా(27) మంగళ్‌హాట్ మార్కెట్ ప్రాంతాన్ని చెందిన సాహిల్ సింగ్(24) గంజాయిని కొనుగోలు చేసి నగరంలో అధిక ధరకు అమ్ముతాడు. ఇతను గతంలో జైలు వెళ్లి వచ్చాడు. మంగళ్‌హాట్ ప్రాంతాన్ని చెందిన అభిషేక్ సింగ్(22) పాత నేరస్తుడు. గంజాయి కేసులో గతంలో జైలు వెళ్లి వచ్చాడు. వరంగల్‌కు చెందిన భూక్య శ్రీకాంత్, సీలేరు చెందిన రామ్ బాబు, ఒడిశాకు చెందిన ఆంజనేయులు కలిసి ఓ ముఠాగా ఏర్పడ్డారు. గంజాయిని ఒడిశా నుంచి తీసుకువచ్చి నగరంలో అధిక ధరకు విక్రయిస్తున్న విషయం తెలుసుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీస్‌లు బుధవారం రాత్రి నాగోలు వెంకటరమణ కాలనీలో నివాసం ఉండే షేక్ అబ్బాస్, దినేష్‌రెడ్డి ఇంటిపై దాడి చేసి 8 మందిని అరెస్టు చేశారు. వీరిలో భూక్య శ్రీకాంత్, సీలేరు చెందిన రామ్ బాబు, ఒడిశాకు చెందిన ఆంజనేయులు పరారీలో ఉన్నారని వారి త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీస్‌లు తెలిపారు.

'లక్ష్య'కు బంగారు పతకం



నాగోలు: కొత్తపేట డివిజన్ సత్యనగర్ కాలనీకు చెందిన పులికంటి లక్ష్య(11) కొత్తపేటలోని ఓక్‌వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతుంది. యోగా మీద ఉన్న మక్కువతో ప్రతిరోజు ఉదయం 5 గంటలకు నుంచి 7 గంటల వరకు యోగా ఆసనాలు చేస్తుంది. కూకట్‌పల్లిలో గురువారం ఆదియోగి పరమేశ్వర ఫౌండేషన్ నిర్వహించిన ఫస్ట్ స్టేట్ లెవెల్ యోగా పోటీల్లో లక్ష్య తన ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం, అవార్డు సాధించింది. దీంతో నిర్వాహకులు లక్ష్యను సన్మానం చేసి అభినందించారు.

క్రమం తప్పని నడకతో చక్కటి ఆరోగ్యం



విజయ్‌భాస్కర్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న చక్రపాణి, రవీందర్‌రెడ్డి

సైదాబాద్: ప్రతిరోజు క్రమం తప్పకుండా నడక సాగించడం వల్ల అనారోగ్య సమస్యలు దూరమై చక్కటి ఆరోగ్యం దక్కించుకోవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చక్రపాణి పేర్కొన్నారు. గురువారం సైదాబాద్ డివిజన్ ఏపీఏయూ కాలనీ కమ్యూనిటీహాల్‌లో గ్రూప్ ఇన్‌స్టాలేషన్ ఆఫ్ క్లబ్స్ పేరిట నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవే పరమావధిగా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ముందుకు సాగాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో వాకర్స్ క్లబ్ ఆఫ్ ఏపీఏయూ కాలనీ అధ్యక్షుడు మడిగెల విజయ్‌భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు రకాలుగా సామాజిక సేవలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయన సంస్థ ప్రతినిధి రవీందర్‌రెడ్డితో కలిసి విజయ్‌భాస్కర్‌రెడ్డికి వాకర్స్ క్లబ్ ఆఫ్ ఏపీఏయూ కాలనీకి రెండోసారి అధ్యక్షుడిగా నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, నాగభూషణం, మాధవరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగులపై రాజకీయ నేతల పెత్తనం ఆపాలి



ఆలయం ముందు నిరసన చేస్తున్న ఆలయ అర్చకులతో ఉద్యోగులు

చంపాపేట: దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోని ఆలయాల ఉద్యోగులు, అర్చకులపై రాజకీయ నాయకుల పెత్తనం, వేధింపులు ఆపాలని రాష్ట్ర అర్చక ఉద్యోగుల జేఏసీ గౌరవ సలహాదారు కుర్మేటి అంబయ్య, ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సమత ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలంటూ బుధవారం రాత్రి అర్చక ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజినేయ స్వామివారి ఆలయం ముందు అర్చకులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇన్‌స్పెక్టర్ సమతపై అధికార పార్టీ నాయకుడు బెల్లం వేణు చేసిన అనుచిత వ్యాఖ్యలు, మానసిక వేధింపుల కారణంగానే ఆమె ఇటీవల తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని అన్నారు. ఆలయ అర్చకులు శంకరశర్మ, అంబాప్రసాద్, ఎస్ రాజు, శ్రవణ్, పీతాంబరాచార్యులు, ప్రవీణ్ శర్మ పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



యోగా శిక్షణ తరగతుల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

చైతన్యపురి: యోగా భారతీయ రుషి సంప్రదాయమని మాజీ ఎంపీ, ప్రముఖ వైద్యుడు బూర నర్సయ్యగౌడ్ అన్నారు. గురువారం షిరిడీ సాయి అష్టాంగ యోగా శిక్షణ తరగతులకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత తరుణంలో కాలుష్యం పెరగటం వల్ల అందరూ అనారోగ్యాల పాలవుతున్నారని, అటువంటి వారికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈనెల 12వ తేదీ నుంచి 15 రోజులపాటు దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్ ల్యాప్ పాఠశాలలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రముఖ యోగా గురువు ఇస్మాయిల్ గురూజీ తెలిపారు. ఆసక్తి గలవారు 9603256572లో సంప్రదించాలన్నారు. శ్రీసిద్ధిరాజ్ తపోతన గిరి స్వామీజీ, బీజేపీ నాయకుడు బూర మల్సూర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శతచండీ యాగం చేయడం అభినందనీయం



ఎల్‌బీనగర్: లోకకల్యాణం కోసం అమ్మవారి ప్రేరణతో గురువుల ఆశీస్సులతో శత చండీ మహాయాగం, రుద్ర సహిత త్రిశ చండీయాగం చేయడం అభినందనీయమని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సాగర్‌కాంప్లెక్స్ ఫేజ్–2 కాలనీలో రేణుకరాజేశ్వరీ పీఠం ఆధ్వర్యంలో మొల్లూరి నవీన్‌శర్మ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న యాగం కోసం దీక్షాదారుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాగం కోసం విరాళంగా రూ. లక్ష అందజేశారు. యాగాన్ని విజయవంతం చేసేందుకు తన సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న యాదగిరి తదితరులు

నాగోలు: ఈనెల 11న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లెపాక యాదగిరి సూచించారు. గురువారం కొత్తపేట డివిజన్ రాజీవ్‌గాంధీనగర్, భరత్‌నగర్ కాలనీలో జాబ్ మేళా పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. 11న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే మెగా జాబ్ మేళాలో అనేక కంపెనీ ప్రతినిధులు పాల్గొంటారని, అక్కడే ఇంటర్వ్యూ చేసి సెలెక్ట్ అయిన వారికి నియామకపత్రాలు అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగేష్, యాదయ్య, ఆంజనేయులు, దశరథ్ నాయక్, రఫిక్, మోహినుద్దీన్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



శివ రామ్ ప్రసాద్‌ని సత్కరిస్తున్న సంఘం నాయకులు

సత్కారం

రంగారెడ్డి జిల్లా కోర్టులు: రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి శివరామ్‌ప్రసాద్ పదోన్నతిపై ఖమ్మం జిల్లా అదనపు జిల్లా న్యాయమూర్తిగా నియమితులైన సందర్భంగా న్యాయవాద సంఘం ఘనంగా వీడ్కోలు పలికారు. సంఘం ప్రధాన కార్యదర్శి దేవరాజ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి ముఖ్యఅతిథిగా హాజరై జిల్లా కోర్టుకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. అనంతరం సంఘం అధ్యక్షుడు గుర్రం సుధాకర్ రెడ్డి న్యాయమూర్తిని సత్కరించి మెమొంటొని అందజేశారు. మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి తిరుపతి, తెలంగాణ న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సంచాలకులు బాచిరెడ్డి శాయి రెడ్డి, సునితా బర్ల, సంఘం ఉపాధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, జక్కుల విజయ్ న్యాయమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు.

ఫాసిస్టేతర రాజకీయ ఫ్రంట్ నిర్మాణానికి కృషి



మన్సూరాబాద్: మనువాది కార్పొరేట్ ఫాసిస్ట్ మోదీ పాలనను ఓడించటానికి సాధ్యమైనంత విస్తృతమైన ఫాసిస్టేతర రాజకీయ ఫ్రంట్ నిర్మించేందుకు కృషి చేస్తామని తెలంగాణ, కర్ణాటక సీపీఐ (ఎంఎల్) ఆర్‌ఐ రాష్ట్రాల కార్యదర్శులు సదానందం, డీహెచ్ పూజార్ అన్నారు. సీపీఐ(ఎంఎల్) ఆర్‌ఐ రాష్ట్ర స్థాయి సదస్సును గురువారం ఎల్‌బీనగర్‌లో నిర్వహించారు. ఈ సదస్సుకు వారు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతకు అన్ని మార్కిస్ట్–లెనినిస్ట్ పార్టీలతో చర్చలు జరిపి ఒకే అఖిల భారత కమ్యూనిస్ట్ పార్టీ ఉండేల చర్యలు చేపడుతామని తెలిపారు. ఈనెల 28న హైదరాబాద్‌లో ఫాసిస్ట్ వ్యతిరేక సభను నిర్వహిస్తున్నామని, అదే విధంగా మార్చి 8న మంచిర్యాలలో రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

రాష్ట్ర కమిటీ సభ్యుల ఎన్నిక..

ఆర్. సంతోష, జాడీ దేవరాజ్, గుడూరు వైకుంఠం, రమాదేవి బింగి, సుధాకర్, అన్వర్‌లను సీపీఐ(ఎంఎల్) ఆర్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పూర్ణచందర్‌రావు, మేకల అరుణ్, ఉస్మాన్‌బాష, లక్ష్మయ్య పాల్గొన్నారు.